నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం

**నేటి కందం- నేటికి అందం**

బాధలను భరించి?మనకు
సాధక బాధకము లెల్ల చక్కని గతిలో
బోధించగ నుతియింతుము
మాధుర్యపు రూపమైన మాతను మదిలోన్ !!

(మే 2 వ ఆదివారం మాతృదినోత్సవం)

-రాధశ్రీ
సెల్:9494481210




# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ ఆదివారం 11-5-2025 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-50 001. సంపుటి :31 సంచిక:223 పేజీలు:6 వెల: రూ.1/-


**చురక**

అందమంటే రూపురేఖ
అసలు కాదు నిత్యత్వం
పూవులోని సుగంధంలా
పరిమళించే వ్యక్తిత్వం
శరీరాల్ని ప్రదర్శించే
షోకుల అందాల పోటీ
మార్కెట్టుకు మోడలింగ్
మహిళల దిగజార్చే బేటి

-వేల్పుల నారాయణ
9440433475



## ముగిసిన యుద్ధం.. అధికారికంగా ప్రకటించిన భారత్ ..



న్యూఢిల్లీ, మే 10: భారత్ – పాక్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదరిందని భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ వెల్లడించారు.. ఈ కాల్పులు విరమణ ఒప్పందం నేటి సాయంత్రం అయిదు గంటల నుంచి అమలులోకి వచ్చిందని తెలిపారు.. నేటి మధ్యాహ్నం 3.35 కి పాకిస్థాన్ మిలటరీ ఆపరేషన్ డైరెక్టర్ జనరల్ మన మిలటరీ ఆపరేషన్ డైరెక్టర్ కు ఫోన్ చేసి కాల్పుల విరమణ ప్రతిపాదన చేశారని తెలిపారు.. దీనిపై ఉన్నతస్థాయి అధికార యంత్రాంగంతో చర్చలు జరిపిన అనంతరం విరమణకు భారత్ కూడా అంగీకరించిందన్నారు.. అంతే కాకుండా భారత్, పాక్ కు చెందిన మిలటరీ జనరల్స్ మధ్య ఈ నెల 12 వ తేదిన చర్చలు జరగనున్నాయని కూడా మిస్రీ ఢిల్లీలో జరిగిన మీడియా సమావేశంలో చెప్పారు.. . ఈ సాయంత్రం నుంచి భూ, గగన, సముద్ర తలాల నుంచి ఇరుదేశాల మధ్య కాల్పుల విరమణ అమల్లోకి వచ్చిందని తెలిపారు.

## అట్టహాసంగా ప్రారంభమైన మిస్ వరల్డ్ పోటీలు

హైదరాబాద్, మే 10: నగరంలో 72వ మిస్ వరల్డ్ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. 110 కిపైగా దేశాలకు చెందిన సుందరీమణులు ఈ కిరీటం కోసం పోటీపడుతున్నారు..

భారత్ తరపున మిస్ ఇండియా నందిని గుప్తా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. గచ్చిబౌలి స్టేడియంలో 'జయజయహే తెలంగాణ' రాష్ట్ర గీతం ఆలాపనతో పోటీలు మొదలయ్యాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా నిర్వహించిన కార్యక్రమాలు అలరించాయి. 250 మంది కళాకారులతో పేరిణి నృత్య ప్రదర్శన నిర్వహించారు. పరిచయ కార్యక్రమంలో భాగంగా పోటీదారులు విభిన్న వస్త్రధారణతో ఆకట్టుకున్నారు.

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, డీజీపీ జితేందర్, తెలంగాణ రాష్ట్ర పర్యాటక శాఖ ఛైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి, నగర మేయర్ విజయలక్ష్మి, మిస్ వరల్డ్ సీఈవో జూలియా మోర్లే, మిస్ వరల్డ్–2024 విజేత క్రిస్టినా పిస్కోవా తదితరులు ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరయ్యారు.



## ఉగ్రవాదంపై భారత్ వైఖరి మారదు.. దృఢంగా వ్యవహరిస్తాం: జైశంకర్

న్యూఢిల్లీ, మే 10: ఉగ్రవాదంపై భారత్ వైఖరి మారదని విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ తెలిపారు. భవిష్యత్తులోనూ ఉగ్రవాదంపై దృఢంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. అమెరికా మధ్యవర్తిత్వంతో జరిగిన కాల్పుల విరమణను ఆయన ప్రస్తావించారు. అన్ని సైనిక చర్యలను నిలిపివేయడానికి భారత్, పాకిస్థాన్ ఒక అవగాహనకు వచ్చాయని ఎస్ జైశంకర్ తెలిపారు. అలాగే ఉగ్రవాదంపై వైఖరికి భారత్ రాజీపడబోదని అన్నారు. 'భారత్, పాకిస్థాన్ దేశాలు కాల్పుల విమరణ, సైనిక చర్యపై ఒక అవగాహన కుదుర్చుకున్నాయి. అన్ని రూపాలు, వ్యక్తీకరణలలో ఉగ్రవాదానికి వ్యతిరేకంగా దృఢమైన, రాజీలేని వైఖరిని భారత్ నిరంతరం కొనసాగిస్తుంది. ఇది అలాగే కొనసాగుతుంది' అని ఎక్స్ పోస్ట్‌లో పేర్కొన్నారు.

కాగా, పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో 'ఆపరేషన్ సిందూర్' పేరుతో భారత్ చేపట్టిన సైనిక చర్యల వల్ల గత కొన్ని రోజులుగా భారత్, పాకిస్థాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతలు తీవ్రస్థాయికి చేరాయి. అయితే పాక్ మిలిటరీ సంప్రదింపుల కారణంగా కాల్పుల విరమణకు భారత్ అంగీకరించిందని విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ తెలిపారు. శనివారం సాయంత్రం 5 గంటల నుంచి ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణ అమల్లోకి వచ్చిందని వెల్లడించారు.

## తెలంగాణలో తొలి ఎక్స్క్లూజివ్ షోరూమ్‌ను ప్రారంభించిన మ్యాట్రెస్ పరుపుల తయారీ సంస్థ 'సెర్టా'




హైదరాబాద్, మే 10 (ఏక ప్రెస్ న్యూస్);ప్రపంచంలోనే అతిపెద్ద మరియు విశ్వసనీయమైన మ్యాట్రెస్ (పరుపుల) తయారీ సంస్థ ×సెర్టా× తెలంగాణ రాష్ట్రంలోని తమ తొలి ఎక్స్క్లూజివ్ షోరూమ్‌ను హైదరాబాద్ ఖాజాగూడలో శుక్రవారం ప్రారంభించింది. ఈ గ్రాండ్ ఓపెనింగ్‌ను సెర్టా ఇండియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నితిన్ గుప్తా ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సెల్స్ ఓ మార్కెటింగ్ డైరెక్టర్ ఎస్.కె. మల్హోత్రా, సేల్స్ హెడ్ ఉదయ్ దుబే మరియు స్థానిక భాగస్వామి డెకర్ వరల్డ్ సిలెక్ట్‌కి చెందిన అంకిత్ గోయల హాజరయ్యారు. ఈ ప్రారంభ కార్యక్రమానికి అనేక మంది ప్రముఖ ఆర్కిటెక్ట్స్, ఇంటీరియర్ డిజైనర్లు మరియు ఇండస్ట్రీ నిపుణులు హాజరైనారు. వారాహమూర్తి ఫ్లెక్సిరబ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్× అనే న్యూఢిల్లీకి చెందిన సంస్థ, సెర్టా బ్రాండ్‌కు ఇండియాలో లైసెన్స్ పొందిన తయారీదారు. సెర్టా బ్రాండ్‌కి 90 సంవత్సరాల చరిత్ర ఉంది, ఇది ×150 కంటే ఎక్కువ దేశాల్లో× అందుబాటులో ఉంది. ఇది ×పోచర్ పెర్ఫెక్ట్ స్పైరల్ స్ప్రింగ్ టెక్నాలజీ, ××ఎయిర్ సపోర్ట్ ఫోమ్× వంటి ఆధునిక సాంకేతికతలతో పేరుగాంచింది. ఈ సందర్భంగా నితిన్ గుప్తా మాట్లాడుతూ, తెలంగాణ మార్కెట్‌పై దృష్టి ? రూ.200 కోట్ల టర్నోవర్ లక్ష్యం అని పెట్టుకున్నట్లు తెలిపారు, "తదుపరి 12 నెలల్లో ×హైదరాబాద్‌లో ఐదు ఎక్స్క్లూజివ్ స్టోర్లను, అలాగే వచ్చే రెండేళ్లలో ××తెలంగాణలో మొత్తం 10 స్టోర్లను× ప్రారంభించాలనే మా లక్ష్యం ఉంది. దీంతో పాటు టర్నోవర్‌ను ప్రస్తుతం ఉన్న రూ.100 కోట్ల నుంచి రూ.200 కోట్లకు పెంచాలని ఆశిస్తున్నాం'' అని పేర్కొన్నారు.

## హైదరాబాద్‌లో బాణాసంచా కాల్చడం నిషేధం

హైదరాబాద్, మే 10:భారత్, పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తత పరిస్థితుల దృష్ట్యా హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ కీలక నిర్ణయం తీసుకున్నారు. హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాల్లో బాణాసంచా కాల్చడాన్ని నిషేధిస్తూ సీపీ సీవీ ఆనంద్ ఆదేశాలు జారీ చేశారు. కంటోన్మెంట్ ఏరియాలోనూ బాణాసంచా కాల్చడం పూర్తిగా నిషేధమన్నారు. హైదరాబాద్ సిటీ పోలీస్ చట్టం, 1348 ఫస్లీ (నం. ఎచీ) సెక్షన్ 67 (సి) కింద ఆయనకు అప్పగించిన అధికారాలను వినియోగించుకుంటూ ఈ ఆదేశాలు జారీ చేశారు. ఈ ఆదేశాలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ నిషేధాజ్ఞలు తదుపరి ఆదేశాల వరకు కొనసాగుతాయని తెలిపారు.

పెళ్లిళ్లు, పండుగలు, షాపుల ప్రారంభోత్సవాలు వంటి ఏ సందర్భంలోనైనా సరే బాణాసంచా కాల్చడంపై నిషేధం ఉంటుందని తెలిపారు. బాణాసంచా అమ్మేవారికి కూడా హెచ్చరికలు జారీ చేశారు. బాణాసంచా కాల్చితే జైలుకు పంపుతామని పోలీసులు స్పష్టం చేశారు. హైదరాబాద్ నగరంలో బాణాసంచా నిషేధానికి ప్రధాన కారణం దేశంలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులే. దేశ సరిహద్దుల్లో యుద్ధ వాతావరణం నెలకొనడం, నగరంలో భద్రతా చర్యలు కొనసాగుతుండటంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. బాణాసంచా శబ్దాలను పేలుళ్లుగా అన్వయించుకునే ప్రమాదం ఉండటంతో ప్రజల్లో భయాందోళనలు నెలకొనే అవకాశం ఉందన్నారు. ఇది శాంతి భద్రతలకు విఘాతం కలిగించవచ్చు. అంతేకాకుండా, బాణాసంచా శబ్దాలు భద్రతా దళాలపై అనవసరమైన ఒత్తిడిని కలిగిస్తాయి. దేశవ్యాప్తంగా కొనసాగుతున్న ఉగ్రవాద కార్యకలాపాల నేపథ్యంలో, బాణాసంచా కాల్చడం వల్ల ఏదైనా అత్యవసర పరిస్థితి ఏర్పడితే స్పందించడం కష్టమవుతుంది.

## కాల్పుల విరమణను భారత్, పాకిస్థాన్ దేశాలు ఒప్పుకున్నాయి : డొనాల్డ్ ట్రంప్



న్యూ డిల్లీ మే 10 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );భారత్–పాకిస్థాన్ దేశాల మధ్య ఉద్రిక్తతలు తీవ్రమవుతున్న వేళ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన ట్రూత్ హ్యాండిల్‌లో సంచలన ప్రకటన చేశారు. భారత్, పాకిస్థాన్ దేశాలు తక్షణమే పూర్తిస్థాయిలో కాల్పులను విరమించేందుకు ఒప్పుకున్నాయని ఆయన ప్రకటించారు. ఈ విషయాన్ని ప్రెస్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా (ఖఎ) తన కథనంలో పేర్కొన్నది.గత నెల 22న జరిగిన పహల్గాం ఉగ్రదాడి యావత్ భారతదేశాన్ని ఉలిక్కిపడేలా చేసింది. ఆ దాడిలో ఉగ్రవాదులు ఏకంగా 26 మంది పర్యాటకులను కాల్చిచంపడాన్ని ప్రపంచ దేశాలు ఖండించాయి. ఈ దాడికి పాల్పడింది పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదులేనని తేలడంతో భారత్ రగిలిపోయింది. పాకిస్థాన్‌లోని ఉగ్రస్థావరాలపై సర్జికల్స్ స్ట్రైక్స్ చేస్తోంది. అందుకు ప్రతిగా పాకిస్థాన్ సరిహద్దుల్లో కాల్పులు జరుపుతూ కవ్వింపులకు పాల్పడుతోంది. ఈ నేపథ్యంలో కేంద్రం తాజా హెచ్చరికలు చేసింది.

## పాక్ వద్ద ఉన్న ముఖ్య మిసైళ్లు.. వాటి సామర్థ్యం

న్యూ డిల్లీ మే 10 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);తినడానికి తిండి గింజలు లేని పాకిస్థాన్ యుద్ధోన్మాదంతో రెచ్చిపోతోంది. భారత్‌ను అదే పనిగా కవ్విస్తోంది. ఈ చర్యలకు దాయాది దేశం తగిన ఫలితం మూటగట్టుకోక తప్పదు. ఇప్పటికే భారత్ పాక్ దేశ స్థావరాలపై భారీ దాడులు చేసి పలు టెర్రరిస్టులను అంతమొందించింది. పాక్ ప్రయోగించిన మిసైళ్లు, డ్రోన్స్‌ను కూడా గాల్లోనే పేల్చిపారేసింది. ఈ నేపథ్యంలో అసలు పాక్ వద్ద ఉన్న ముఖ్య మిసైళ్లు ఏవో చూద్దాం.పాక్ ఇటీవలే 450 కిలోమీటర్ల రేంజ్ బాలిస్టిక్ మిసైల్ అబ్దాలీని ఇటీవలే పరీక్షించింది. దీనితో పాటు అనేక ఇతర మిసైళ్లు పాక్ వద్ద ఉన్నాయి. దాయాది వద్ద ఉన్న హఫ్త్–1 షార్ట్ రేంజ్ బాలిస్టిక్ మిసైల్.. 70–100 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించగలదు. సంప్రదాయ వార్ హెడ్స్‌ను మోసుకెళ్లగలదు.హఫ్త్–2 (అబ్దాలీ) 180 నుంచి 200 కిలోమీటర్ల రేంజ్‌ను టార్గెట్ చేయగలదు. ఇది రకరకాల వార్ హెడ్స్‌ను మోసుకెళ్లగలదు. హఫ్త్–3 (ఘజ్నవీ) మిసైల్ రేంజ్ 300 కిలోమీటర్లు. దీనికి అణువార్ హెడ్‌లను మోసుకెళ్లే సామర్థ్యం కూడా ఉంది. ఇక హఫ్త్–4 (షాహీన్–1) షార్ట్ రేంజ్ బాలిస్టిక్ మిసైల్.. 750 నుంచి 900 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించగలదు. అణు, రసాయనిక వార్‌హెడ్‌లను మోసుకెళ్లే సామర్థ్యం దీని సొంతం. ఇక మధ్య శ్రేణి ఘౌరీ మిసైల్ 1250 నుంచి 1500 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించగలదు. అణు వార్ హెడ్స్ ప్రయోగించేందుకు వీటిని పాక్ ఉపయోగించొచ్చు.షాహీన్ –2 కూడా మధ్యశ్రేణి బాలిస్టిక్ మిసైల్. దీని రేంజ్ గరిష్ఠంగా 2 వేల కిలోమీటర్లు. అణు, రసాయన వార్ హెడ్స్ మోసుకెళ్లగలదు. సబ్ సానిక్ క్రూయిజ్ మిసైల్ బాబర్.. 350 నుంచి 700 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించగలదు. హఫ్త్ నసర్ అనే స్వల్ప శ్రేణి మిసైల్‌కు అణుసామర్థ్యం ఉంది. దీని రేంజ్ 70 కిలోమీటర్లు. షాహీన్ –3 మధ్య శ్రేణి మిసైల్ ప్రస్తుతం అభివృద్ధి దశలో ఉంది. దీని రేంజ్ 2750కిలోమీటర్లు. నేవీ షిప్‌లను ధ్వంసం చేసేందుకు ఉద్దేశించిన ఎక్సోసెట్ క్షిపణి సామర్థ్యం 40 నుంచి 180 కిలోమీటర్లు. అణుసామర్థ్యం కలిగిన మధ్య శ్రేణి క్షిపణి అబాదిల్ ప్రస్తుతం అభివద్ధి దశలోనే ఉంది.

## మిస్ వరల్డ్ పోటీలపై యుద్ధం ఎఫెక్ట్.. సీఎం రేవంత్ దూరం

హైదరాబాద్, మే 10: భారత్ – పాకిస్థాన్ యుద్ధ ప్రభావం హైదరాబాద్ లో జరిగే మిస్ వరల్డ్ –2025 పోటీలపై పడింది. నేటి సాయంత్రం జరగనున్న 72వ మిస్ వరల్డ్ పోటీల ప్రారంభోత్సవానికి సీఎం రేవంత్ రెడ్డి దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నారు. యుద్ధం నేపథ్యంలోనే దూరంగా ఉంటున్నట్లు ఆయన కార్యాలయ వర్గాలు వెల్లడించాయి. అలాగే రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఇవ్వాల్సిన డిన్నర్ ను కూడా రద్దు చేసుకున్నారు.ఇదిలా ఉండగా.. ఇండో పాక్ సరిహద్దుల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో మిస్ వరల్డ్ పోటీలను రద్దు చేయాలని, లేదా వాయిదా వేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. నేటి నుంచి ఈనెల 31వ తేదీ వరకూ నగరంలోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో అత్యంత వైభవంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పటిష్ట బందోబస్త్ ఏర్పాట్లు చేస్తోంది. జూన్ 1న హైటెక్స్ లో గ్రాండ్ ఫినాలే జరగనుండగా.. 120 దేశాలకు చెందిన సుందరీమణులు ఈ పోటీల్లో

## గ్రానైట్ లారీ బోల్తా.. ముగ్గురు మృతి

అమరావతి, మే 10: ప్రకాశం జిల్లా పర్చూరు మండలం తిమ్మరాజుపాలెం వద్ద ఇవాళ తెల్లవారుజామున రోడ్డు ప్రమాదం జరిగింది. రోడ్డు దాటుతున్న క్రమంలో ఒక్కసారి బ్రేక్ వేయడంతో గ్రానైట్ పలకల లారీ బోల్తా పడింది. గ్రానైట్ పలకల లారీ మార్టూరు నుంచి పర్చూరు మీదుగా గుంటూరు వైపు వెళుతుండగా తిమ్మరాజుపాలెం వద్ద ఈ ప్రమాదం జరిగింది.

బాపట్ల డీఎస్పీ రామాంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం .. లారీపై కూర్చున్న ముగ్గురు వ్యక్తులు గ్రానైట్ పలకల క్రింద పడి అక్కడికక్కడే మృతి చెందారు. మృతి చెందిన వారు పాలేటి శ్రీను (మార్టూరు), తాళ్లూరి ప్రభుదాసు (మార్టూరు), తమ్ములూరి సురేంద్ర (నూతలపాడు)గా గుర్తించారు. మృతి చెందిన వారందరూ మార్టూరు, నూతలపాడు ఎస్సీ కాలనీలకు చెందిన వారు. దీంతో ఆయా గ్రామాల్లో విషాదం చోటుచేసుకుంది.

గ్రానైట్ పలకలను దించి రావడానికి వెళుతూ మృత్యు ఒడిలోకి జారుకోవడంతో బంధువులు, కుటుంబ సభ్యులు భోరున విలపిస్తున్నారు.

సమాచారం అందుకున్న బాపట్ల డీఎస్పీ రామాంజనేయులు, పర్చూరు పోలీసులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు.

గ్రానైట్ పలకలను తొలగించి మృతదేహాలను వెలికి తీశారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పర్చూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

## కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది.. ప్రకటించిన భారత సైన్యం



న్యూఢిల్లీ, మే 10:పహల్గాం ఉగ్రదాడి జరిగినప్పటి నుంచి భారత్–పాకిస్థాన్ దేశాల మధ్య పెరుగుతూ వచ్చిన ఉద్రిక్తతలకు శనివారంతో తెరపడింది. రెండు దేశాలు కాల్పుల విరమణకు అంగీకరించాయి. ఈ విషయాన్ని భారత విదేశాంగ శాఖ, రక్షణ శాఖ ప్రకటించాయి. తాజాగా భారత సైన్యం కూడా మీడియా సమావేశం ఏర్పాటు చేసి రెండు దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిందని అధికారికంగా ప్రకటించింది.మీడియా సమావేశంలో నేవీ ఎండీఈ రఘు నాయర్ మాట్లాడుతూ.. భారత్, పాకిస్థాన్ దేశాల మధ్య కాల్పుల విరమణకు ఒప్పందం కుదిరిందని అన్నారు. శనివారం మధ్యాహ్నం పాక్ డీజీఎంవో భారత డీజీఎంవోకు ఫోన్‌లో కాల్పుల విరమణ ప్రతిపాదన చేశారని, ఈ ప్రతిపాదనకు భారత్ అంగీకరించిందని తెలిపారు. కల్నల్ సోఫియా ఖురేషి మాట్లాడుతూ.. భారత్‌లో మతసామరస్యాన్ని దెబ్బతీసేందుకు పాకిస్థాన్ అసత్య ప్రచారం చేసిందని అన్నారు. పాకిస్థాన్‌లోని మత సంస్థలపై భారత్ దాడులు చేసిందనడం అవాస్తవమని చెప్పారు.నియంత్రణ రేఖ వద్ద పాకిస్థాన్‌కు తీవ్ర నష్టం జరిగిందని ఖురేషి తెలిపారు. భారత సైన్యం సర్వసన్నద్ధతో ఉన్నదని, పాకిస్థాన్ ఆర్మీ బేస్‌లను ధ్వంసం చేసిందని చెప్పారు. పాకిస్థాన్ చెబుతున్నట్లుగా భారత ఆర్మీకి ఎలాంటి నష్టం జరగలేదని అన్నారు. ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ మాట్లాడుతూ.. భారత ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ ఎస్–400ను ధ్వంసం చేసినట్లు పాకిస్తాన్ అబద్ధం చెప్పిందని తెలిపారు.

పాకిస్థాన్ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలనే తాము ధ్వంసం చేశామని చెప్పారు. పాకిస్థాన్‌కు చెందిన జేఎఫ్–17 యుద్ధ విమానం భారత్‌పై దాడి చేసిందనడం కూడా అసత్యమేనన్నారు.

## మే 27వ తేదీన కేరళను తాకనున్న నైరుతీ రుతుపవనాలు

### – పేర్కొన్న భారతీయ వాతావరణ శాఖ


న్యూఢిల్లీ మే 10 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: ఈసారి వర్షాకాలం ముందే రానున్నది. మే 27వ తేదీన నైరుతీ రుతుపవనాలు కేరళను తాకనున్నట్లు భారతీయ వాతావరణ శాఖ పేర్కొన్నది. ఒకవేళ అంచనా వేసినట్లు ముందుగానే రుతుపవనాలు కేరళను చేరితే, అప్పుడు 2009 తర్వాత తొలిసారి వర్షాకాలం ముందుగా వస్తున్నట్లు ఐఎండీ వెల్లడించింది. 2009 సంవత్సరంలో మే 23వ తేదీన నైరుతీ కేరళను తాకినట్లు ఐఎండీ డేటా ప్రకారం తెలుస్తున్నది.

సాధారణంగా జూన్ ఒకటో తేదీ వరకు కేరళలోకి నైరుతీ రుతుపవనాలు ప్రవేశిస్తాయి. ఈ రుతుపవనాల వల్లే దేశంలో వర్షాకాలం ప్రారంభం అవుతుంది. ఆ తర్వాత జూలై 8వ తేదీలోగా దేశవ్యాప్తంగా ఆ రుతుపవనాలు విస్తరిస్తాయి. ఇక సెప్టెంబర్ 17వ తేదీ నుంచి ఆగ్నేయ దిశ నుంచి తిరోగమనం అవుతాయి.

అక్టోబర్ 15వ తేదీలోగా పూర్తి ఆ రుతుపవనాలు వెళ్లిపోతాయి. 2025 వర్షాకాలంలో.. సాధారణం కన్నా అధికంగానే వర్షం కురుస్తుందని ఏప్రిల్‌లో ఐఎండీ వెల్లడించిన విషయం తెలిసిందే.

ఎల్ నినో పరిస్థితులు ఉండబోవని ఐఎండీ పేర్కొన్నది. జూన్ నుంచి సెప్టెంబర్ వరకు ఈసారి నాలుగు నెలల్లో వర్షపాతం నార్మల్ స్థాయి కన్నా ఎక్కువే ఉంటుందని ఎర్త్ సైన్సెస్ శాఖ కార్యదర్శి ఎం రవిచంద్రన్ తెలిపారు.


తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ
సౌజన్యంతో
మరువం - చర్చావేదిక
ఆహ్వానం
*
జీవాళి
ప్రముఖ సంగీత విద్వాంసులు
ప్రఖ్యాత వయోలిన్ కళాకారులు
పూర్వ అధ్యక్షులు, మహారాజా ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల, విజయనగరం
ద్వారం దుర్గాప్రసాదరావు గారి
సంగీత సాహిత్య ఇతర విషయ వ్యాసాల విశిష్ట సంపుటి
ఆవిష్కరణ
విజ్ఞులు, సహృదయులు, మిత్రులు, జిజ్ఞాసులతో
ఆత్మీయ సంభాషణ
*
శుక్రవారం 16 మే 2025
సాయంకాలం 6 గం.ల నుండి
రవీంద్ర భారతి మినీ హాల్ (మొదటి అంతస్తు)
సైఫాబాదు - హైదరాబాదు

# అటవీశాఖ సలహాదారుతో డిప్యూటీ సీఎం సమీక్ష సమావేశం



అమరావతి, మే 10:మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో అటవీ శాఖ సలహాదారుతో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సమీక్షా సమావేశం నిర్వహించారు. అటవీ శాఖ ప్రభుత్వ సలహాదారు మల్లికార్జునరావు (రిటైర్డ్) ఎఈూతో నిర్వహించిన ఈ సమావేశంలో, అటవీ శాఖ చేపట్టిన కార్యక్రమాలు, తీసుకుంటున్న చర్యల గురించి ప్రత్యేక చర్చలు జరిపారు.

రాష్ట్రంలో పచ్చదనాన్ని 50 శాతానికి పెంచడానికి తీసుకుంటున్న చర్యలు, వన్యప్రాణులు మానవుల మధ్య సంఘర్షణలను నివారించడానికి తీసుకోవలసిన మరిన్ని చర్యల గురించి చర్చించారు. అలాగే, అటవీ సంరక్షణలో స్థానిక ప్రజల పాత్రను పెంచడానికి, పర్యావరణ పర్యాటకాన్ని అభివృద్ధి చేయడానికి, మొక్కల పెంపకం, కలప ఉత్పత్తిని ప్రోత్సహించడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు.

గతంలో నిర్ణయించిన ప్రణాళికలను నిర్ణీత కాలపరిమితిలో అమలు చేయడానికి, స్థానిక ప్రజలకు, పర్యావరణానికి ప్రయోజనకరమైన స్థిరమైన అభివృద్ధిని సాధించడానికి, అటవీ శాఖలో తీసుకోవాల్సిన చర్యలు తీసుకోవడానికి పూర్తి సమగ్ర ప్రణాళికను సిద్ధం చేయాలని ఆదేశించారు.

ఈ సమావేశంలో పంచాయత్ రాజ్ కమిషనర్ మైలవరపు కృష్ణ తేజ ఐఏఎస్, ఉపముఖ్యమంత్రి ఓఎస్డీ వెంకట కృష్ణ, అసిస్టెంట్ కన్జర్వేటివ్ ఫారెస్ట్రీ ఎన్.వి.శివరామ్ ప్రసాద్ పాల్గొన్నారు.

# కోరుట్లలో రద్దీ ప్రాంతాల్లో పోలీసుల తనిఖీలు

కోరుట్ల, మే 10: పట్టణంలో నిత్యం జన సమ్మర్ధంతో రద్దీగా ఉండే ప్రాంతాల్లో శనివారం కోరుట్ల పోలీసులు డాగ్ స్క్వాడ్ బృందంతో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కోరుట్ల కొత్త బస్టాండ్, ఆర్బీ హోటల్ పరిసరాలు, కిసాన్ షాపింగ్ మాల్లో, పూజ స్వీట్ హౌజ్ సమీపంలో తనిఖీలు చేపట్టారు.

ప్రయాణీకుల లగేజీతో పాటూ బాటసారుల బ్యాగులను క్షుణ్ణంగా పరిశీలించారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో సాధారణ తనిఖీల్లో భాగంగా ముందస్తు జాగ్రత్త కోసం తనిఖీలు నిర్వహించామని ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. అనుమానస్పద వ్యక్తుల కదలికలపై పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

# ప్రజల కోసం నా స్వంత నిధులు వెచ్చించా..

## –అందుకే కుట్టుమిషన్ లకు పసుపు రంగు వేశా
## –మీలా ప్రభుత్వ సొమ్ముతో మీ పార్టీ రంగు వేయలేదు
## –మీలా పార్టీ రంగుల యావ మాకు లేదు
## –నీ అబద్ధం తాత్కాలికం. మా నిజం శాశ్వతం
## –జగన్ కు కౌంటర్ ఇచ్చిన నారా లోకేష్

అమరావతి మే 10: వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో ప్రజలను గాలికి వదిలేసి, ప్రజాధనాన్ని దోచుకోవడమే పనిగా పెట్టుకున్నారని ఏపీ మంత్రి నారా లోకేశ్ తీవ్రస్థాయిలో విమర్శించారు. తాను ఎమ్మెల్యేగా కూడా లేని సమయంలోనే, మంగళగిరి నియోజకవర్గ ప్రజల పట్ల తన బాధ్యతను గుర్తించి, వారి స్వయం ఉపాధికి చేయూతనందించేందుకు వ్యక్తిగత నిధులను వెచ్చించానని లోకేశ్ తెలిపారు. కులమతాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ అండగా నిలిచానని పేర్కొన్నారు. సోషల్ మీడియాలో తమపై దుష్ప్రచారం చేస్తున్నారంటూ లోకేశ్ ఈ సందర్భంగా మండిపడ్డారు.

ప్రభుత్వ సొమ్ముతో కుట్టు మిషన్లు కొని వాటికి పసుపు రంగు వేసి అందిస్తున్నారంటూ జగన్ చేసిన వ్యాఖ్యలకు లోకేశ్ ఘాటుగా స్పందించారు.

"జగన్ గారూ మీరు అధికారంలో ఉన్న ఐదేళ్లూ ప్రజలని గాలికి వదిలేసి, జనం సొమ్ము దోచుకోవడమే పనిగా పెట్టుకున్నారు. అప్పుడు నేను ఎమ్మెల్యేని కూడా కాను. ప్రజల కోసమే పుట్టిన తెలుగుదేశం పార్టీ నాయకుడిగా, నా మంగళగిరి నియోజకవర్గ ప్రజలకు స్వయం ఉపాధికి చేయూత నందించాలని నిర్ణయించుకున్నాను. మహిళలు, చేనేతలు, స్వర్ణకారులు, చిరు వ్యాపారులకు అవసరమైన సామాగ్రి, ఆర్థిక సాయంతో చేయూతనందించాను. వీటన్నింటికీ నా సొంత నిధులు వెచ్చించాను.

కుల, మత అంతరాలు పాటించకుండా? తమ కాళ్లపై తాము నిలబడాలనుకునే మహిళామణులు వేలాది మందికి స్త్రీశక్తి పేరుతో ఉచితంగా శిక్షణ ఇచ్చి, ట్రైనింగ్ పూర్తయ్యాక సర్టిఫికెట్లు, ఉచితంగా టైలరింగ్ మిషన్, మెటీరియల్ అందజేశాను. మంగళగిరి స్త్రీ శక్తి కేంద్రం 2022 జూన్20 ప్రారంభించాం. ఈ కేంద్రం ఇప్పటివరకూ 43బ్యాచ్ లలో 2226 మంది శిక్షణ పూర్తిచేసుకోగా, వీరందరికీ మిషన్లు అందజేశాం.

తాడేపల్లిలో స్త్రీ శక్తి కేంద్రం 2023 ఫిబ్రవరి 1న ప్రారంభమైంది. ఇక్కడ 17 బ్యాచ్ లలో శిక్షణ తీసుకున్న 666 మందికి మిషన్లు ఉచితంగా ఇచ్చాం. దుగ్గిరాలలో 2023 ఏప్రిల్ 10న ఆరంభించిన స్త్రీశక్తి కేంద్రంలో 16 బ్యాచ్ లలో 616 మంది ట్రైనింగ్ పూర్తి చేసుకోగా, వీరందరికీ మిషన్లు పంపిణీ చేశాం. ఇప్పటివరకూ 3508 మందికి శిక్షణ పూర్తిచేసి, ఉచితంగా నాణ్యమైన కుట్టు మిషన్లు అందజేశాం. ఇవన్నీ నా జేబులోంచి తీసిన డబ్బులు, నా ఖాతాల నుంచి వెచ్చించిన సొమ్ములు కాబట్టే? శుభానికి సంకేతమైన నా పార్టీ పసుపు రంగు మిషన్లు ఇచ్చాను. జనం సొమ్ముతో పెట్టిన పథకాలకు నీలా పార్టీ రంగులు, నీ పేర్లు పెట్టుకోవాలనే యావ మాకు లేదు. నీ అబద్ధం తాత్కాలికం. మా నిజం శాశ్వతం" అంటూ లోకేశ్ అన్నారు.

# ఎస్-400 మిస్సైల్ సిస్టమ్‌పై తప్పుడు వార్తలు: భారతీయ సైన్యం

న్యూఢిల్లీ మే 10 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: భారత్‌కు చెందిన ఎస్–400 ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ ధ్వంసమైనట్లు వస్తున్న వార్తలను భారతీయ సైన్యం(ఎనిటతిజీని ఓతిశ్రీతిబిజీతీఎ) ఖండించింది. ఆదంపూర్‌లో ఉన్న ఎస్–400 రక్షణ వ్యవస్థను పాకిస్థాన్‌కు చెందిన జేఎఫ్–17 ఫైటర్ విమానలకు చెందిన హైపర్‌సోకిన్ మిస్సైల్లు ధ్వంసం చేసినట్లు వార్తలను వ్యాపిస్తున్నాయి. ఆ వార్తల్లో వాస్తవం లేదని ఇండియన్ మిలిటరీ అధికారి ఒకరు స్పష్టం చేశారు. ఎస్–400 రక్షణ వ్యవస్థ ధ్వంసమైనట్లు పాకిస్థాన్‌కు చెందిన పీటీవీలో వార్తలు ప్రసారం అయ్యాయి. ఆ వార్తలను ఖండిస్తూ భారతీయ సైన్యం ప్రకటన చేసింది. చైనాకు చెందిన జినాహూ వార్తా ఏజెన్సీ కూడా ఎస్400 ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ ధ్వంసమైనట్లు వార్తలను ప్రచురించింది. అయితే ఆ వార్తలు అన్నీ అబద్దాలు అని భారతీయ సైన్యం పేర్కొన్నది.

# ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అభినందన




రాజన్న సిరిసిల్ల, మే 10: (నేటినిజం ప్రతినిధి): ప్రాథమిక పాఠశాల న్యూ అర్బన్ కాలనీ విద్యార్థులు శివరాత్రి శ్రావణి , మోతె అనన్య, శివరాత్రి శ్రీనిధి, తోట యశోద లు ఇటీవల జరిగిన 5వ, తరగతి గురుకుల ప్రవేశ పరీక్ష ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించి బిసి వెల్ఫేర్ గురుకుల పాఠశాల పెద్దమ్మ గుడి దగ్గర బాలానగర్, వేములవాడ లో సీట్లు సాధించడం పట్ల వేములవాడ శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ విద్యార్థులకు అభినందనలుతెలిపారు.

ఉన్నత లక్ష్యాలతో విద్యలో ఉన్నతంగా రాణించి తల్లిదండ్రులు, సమాజం గర్వించే విధంగా ఎదగాలని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు విక్కుర్తి లక్ష్మీనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

# అమర వీరుడు మురళీ నాయక్ కుటుంబానికి ఆర్థిక సాయం ప్రకటించిన బాలయ్య

అమరావతి, మే 10: పహల్గాం ఉగ్రదాడిలో 26 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోవడంతో భారత్ సైన్యం ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. దీని తర్వాత పాకిస్తాన్ సైన్యం డ్రోన్లు, యుద్ధ విమానాలను మనదేశం పైకి ప్రయోగించింది. వీటిని మన సైనిక బలగాలు తిప్పికొట్టారు. జమ్మూ కాశ్మీర్ సరిహద్దులో పాకిస్థాన్ సైన్యం కాల్పుల్లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన జవాన్ మురళీ నాయక్ వీరమణం చెందారు. మురళీ నాయక్ మరణంతో తల్లిదండ్రులు శ్రీరాం నాయక్, జ్యోతీ బాయిలు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. 2022 డిసెంబర్ లో గుంటూరులో జరిగిన ఎంపిక ప్రక్రియలో అగ్నివీర్ గా ఎంపికయ్యి బోర్డర్ లో సేవలందిస్తున్నారు.


మురళీ నాయక్ వీరమరణం చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మురళి నాయక్ మృతదేహం గోరంట్ల మండలం కళ్లితాండా గ్రామానికి చేరుకున్నట్టు తెలుస్తుంది. మురళినాయక్ మృతి పట్ల ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, నారా లోకేష్‌తో పాటు పలువురు ప్రముఖులు సంతాపం తెలిపారు. మురళీ నాయక్ మరణం చాలా బాధని కలిగించిందని బాలకృష్ణ అన్నారు. ఇక తాజాగా మురళీ నాయక్ కుటుంబానికి ఆర్థిక సాయం ప్రకటించారు బాలకృష్ణ. తన వంతుగా ఒక నెల జీతాన్ని మురళీ నాయక్ కుటుంబానికి ఇస్తున్నట్టు ప్రకటించారు బాలయ్య.

మే 12న బాలకృష్ణ మురళీ నాయక్ స్వగ్రామానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులని పరామర్శించి తాను ప్రకటించిన నగదు అందజేయనున్నారు. మురళికి చిన్నతనం నుండే దేశభక్తి అంటే చాలా ఎక్కువ. దీంతో.. రైల్వేలో వచ్చిన ఉద్యోగాన్ని కూడా వదులుకొని ఆర్మీలో చేరాడు. పాకిస్తాన్ తీవ్రవాదుల ఎదురుదాడిలో పోరాడి ముగ్గురు తీవ్రవాదులను మట్టుబెట్టి చివరకు తీవ్రవాదుల ఎదురు కాల్పుల్లో మురళీ నాయక్ వీరమరణం పొందారు.. 25 ఏళ్ల వయసులోనే దేశం కోసం అమరుడైన మురళీ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని సిఎం చంద్రబాబు తెలిపారు. వీరజవాను మురళీ నాయక్ కుటుంబాన్ని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఫోన్లో పరామర్శించారు

# మృతుల కుటుంబాలకు 10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన సీఎం ఒమర్ అబ్దుల్లా

జమ్మూ, మే 10: జమ్మూకశ్మీర్ ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. పాక్ కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయిన బాధిత కుటుంబాలకు 10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వనున్నట్లు సీఎం ఒమర్ అబ్దులా తెలిపారు. పూంచ్, రాజౌరి, జమ్మూ, బారాముల్లా సెక్టార్లలో గత నాలుగు రోజుల్లో జిల్లా డెవలప్మెంట్ ఆఫీసర్‌తో పాటు మరో 18 మంది గ్రామస్తులు మృతిచెందారు. పూంచ్ జిల్లాలో బుధవారం 12 మంది సాధారణ పౌరులు మరణించారు. శుక్రవారం పూంచ్, ఉరిలో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. శనివారం తెల్లవారుజామున జరిగిన కాల్పుల్లో అయిదుగురు పౌరులు, సీనియర్ ప్రభుత్వ ఆఫీసర్ చనిపోయారు. పాకిస్థాన్ జరుపుతున్న షెల్లింగ్ వల్ల అమాయకులు మృతిచెందడం తీవ్ర బాధను కలిగిస్తున్నదని, ప్రజల సమస్యలను తగ్గించేందుకు వీలైనన్ని చర్యలు తమ ప్రభుత్వం తీసుకుంటోందని సీఎం ఒమర్ అబ్దుల్లా తెలిపారు.

# ఉద్రిక్తతలకు తెర.. ఐపీఎల్ పునరుద్ధరణ దిశగా బీసీసీఐ..!




న్యూఢిల్లీ, మే 10: భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతలకు తెరపడింది. శనివారం సాయంత్రం 5 గంటల నుంచి ఇరుదేశాలు శనివారం కాల్పుల విరమణకు అంగీకరించాయి. దాంతో, యుద్ధ వాతావరణం తొలగిపోయి సాధారణ పరిస్థితులు ఏర్పడే అవకాశముంది. ఈ నేపథ్యంలో వారం రోజుల పాటు వాయిదా వేసిన ఐపీఎల్ 18వ సీజన్ పునరుద్ధరణపై బీసీసీఐ దృష్టి సారించనుంది. మిగతా 16 మ్యాచ్‌లను నిర్వహించి లీగ్‌ను విజయవంతం చేయడం కోసం కార్యాచరణ సిద్ధం చేయనుంది.

ఉద్రిక్తతల నేపథ్యంలో ధర్మశాల వేదికగా మే 8వ తేదీన ఢిల్లీ క్యాపిటల్స్, పంజాబ్ కింగ్స్ మధ్య మ్యాచ్‌ను అర్ధాంతరంగా రద్దు చేయాల్సి వచ్చింది. ఆ తర్వాత ఫ్రాంచైజీ యజమానులతో, బ్రాడ్‌కాస్టింగ్ సంస్థలతో చర్చలు జరిపిన బీసీసీఐ ఐపీఎల్‌ను వారం రోజులు వాయిదా వేసింది. ఇప్పుడు ఇరుదేశాలు కాల్పుల విరమణకు అంగీకరించడంతో పరిస్థితులు చక్కబడే అవకాశముంది.

దాంతో, తదుపరి 16 మ్యాచ్‌లను హైదరాబాద్, బెంగళూరు, చెన్నైలో నిర్వహించాలనుకున్న బీసీసీఐ .. తన ఆలోచన మార్చుకునేందుకు ఆస్కారముంది. ఇంతకుముందున్న షెడ్యూల్ ప్రకారమే మ్యాచ్‌లు జరిగేందుకు వీలుంది. కొన్ని డబుల్ హెడర్స్ ఆడించడం ఖాయమని అనిపిస్తోంది. అయితే.. షెడ్యూల్ గురించి బీసీసీఐ నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

# వరుసగా మూడో పతకం.. పసిడితో యువ ఆర్చర్ కల సాకారం




న్యూఢిల్లీ, మే 10: ప్రతిష్ఠాత్మక ఆర్చరీ వరల్డ్ కప్‌లో భారత ఆర్చర్ మధుర ధమన్‌గాంకర్ చరిత్ర సృష్టించింది. వరల్డ్ కప్‌లో ఇప్పటికే రెండు పతకాలు గెలిచిన తను.. పసిడితో తన కలను సాకారం చేసుకుంది. మూడేళ్ల విరామం తర్వాత పోటీపడిన ఆమెకు విశ్వవేదికపై ఇదే తొలి స్వర్ణం కావడం విశేషం. శనివారం జరిగిన ఆర్చరీ వరల్డ్ స్టేజ్ 2 ఫైనల్లో మధుర గురి తప్పకుండా బాణాలు సంధించింది. అమెరికాకు చెందిన కార్సన్ క్రాహేను 139 -138 పాయింట్లతో ఓడించింది.

చైనాలోని షాంఘైలో జరుగుతున్న ఆర్చరీ వరల్డ్ కప్ స్టేజ్ 2లో ముంబైకి చెందిన మధుర అదరగొట్టింది. ప్రపంచ స్థాయి క్రీడాకారిణులతో పోటీపడుతూ ఫైనల్‌కు దూసుకెళ్లింది. ఆమెరికా ఆర్చర్ కార్సన్ క్రాహేకు సవాల్ విసిరిన మధుర.. గురి చూసి లక్ష్యాన్ని చేరుకుంది. మూడో రౌండ్‌లో81–85తో వెనకబడినప్పటికీ ఒత్తిడికి లోనవ్వలేదు. వరుసగా రెండుసార్లు 10 పాయింట్లు సాధించి ప్రత్యర్థికి షాకిచ్చింది.

ఆఖరి రౌండ్‌లో 9 పాయింట్లతో కార్సన్‌ను వెనక్కి నెట్టి.. స్వర్ణ పతకం గెలుచుకుంది. తద్వారా విశ్వ వేదికపై తొలి బంగారు పతకంతో మురిసిపోయింది యువ ఆర్చర్. మూడేళ్లుగా అంతర్జాతీయ టోర్నీలో పాల్గొనకపోవడంతో 24 ఏళ్ల మధర అన్ సీడెడ్‌గా ఈ పోటీల్లో బరిలోకి దిగింది. ఈవెంట్‌లో మహిళల టీమ్ ఈవెంట్‌లో వెండి, కాంపౌండ్ మిక్స్‌డ్ విభాగంలో అభిషేక్ వర్మతో కలిసి దేశానికి కాంస్యం అందించింది మధుర.

# లేడీ డాక్టర్ అరెస్ట్.. 53 గ్రాముల కొకైన్ స్వాధీనం

హైదరాబాద్, మే 10: హైదరాబాద్ నగరంలోని ఒక ప్రముఖ ఆస్పత్రికి చెందిన వైద్యురాలు చిగురుపాటి నమ్రతను రాయదుర్గం పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. మాదక ద్రవ్యాలను కలిగి ఉండడం, వినియోగంతో పోలీసులు అరెస్ట్ చేశారు. ఆమె వద్ద నుంచి పోలీసులు 53 గ్రాముల కొకైన్, రూ.10 వేల నగదు అదేవిధంగా రెండు మొబైల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు.

రాయదుర్గం ఇన్‌స్పెక్టర్ సీహెచ్ వెంకన్న తెలిపిన వివరాల ప్రకారం.. వైద్యురాలు ఇటీవల ముంబైకి చెందిన వాంష్ ధక్కర్ అనే వ్యక్తికి కొకైన్ కోసం ఆర్డర్ ఇచ్చినట్లుగా తెలిపారు. శుక్రవారం, వాంష్ ఒక ఏజెంట్ బాలకృష్ణ ద్వారా 53 గ్రాముల కొకైన్ ఉన్న పార్శిల్‌ను నమ్రతకు డెలివరీ చేయడానికి పంపాడు. సమాచారం మేరకు రాయదురంలో బాలకృష్ణ నుండి పార్శిల్ తీసుకుంటున్నప్పుడు నమ్రతను తాము పట్టుకున్నట్లు వెల్లడించారు. నమ్రత, బాలకృష్ణ, వంశ్‌లపై ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

# సెలబ్రిటీలు ఎక్కువగా తాగుతున్న జ్యూస్ ఇది.. దీన్ని తాగితే ఎన్ని అద్భుతమైన లాభాలు ఉంటాయంటే..?

హైదరాబాద్, మే 10:ఈమధ్య కాలంలో సెలబ్రిటీలు ఎక్కడ చూసినా సరే నోని ఫ్రూట్ జ్యూస్‌ను తాగుతూ లేదా ఈ పండ్లను తింటూ కనిపిస్తున్నారు. సోషల్ మీడియాలో ఈ పండ్ల గురించిన వార్తలు ట్రెండ్ అవుతూనే ఉన్నాయి. నోని అని పిలవబడే ఈ పండ్లను ఆసియాలోని కొన్ని దేశాలు, ఆస్ట్రేలియాల్లో అధికంగా పండిస్తున్నారు. మన దేశంలోనూ ఈ పండ్ల వినియోగం పెరుగుతున్న కారణంగా ఈ పండ్లను మన దగ్గర కూడా పండిస్తున్నారు. ఈ పండ్లను మనం సూపర్ మార్కెట్లలో కొనుగోలు చేయవచ్చు. ఈ పండ్లను నేరుగా తినడం కన్నా జ్యూస్‌లా చేసి తాగితే మంచిదని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. నోని పండ్ల వల్ల మనకు కలిగే ప్రయోజనాలు ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం.

### గుండె జబ్బులు రాకుండా..

నోని పండ్లలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. విటమిన్ సి, ఇలతోపాటు బీటా కెరోటిన్, ఐరిడాయిడ్స్ అధికంగా ఉంటాయి. ఇవన్నీ యాంటీ ఆక్సిడెంట్ల మాదిరిగా పనిచేస్తాయి. ఇవి మన శరీరంలోని ఫ్రీ ర్యాడికల్స్‌ను నిర్మూలిస్తాయి. దీంతో కణాలకు జరిగే నష్టం నివారించబడుతుంది. ముఖ్యంగా క్యాన్సర్ కణాలు పెరగకుండా అడ్డుకోవచ్చు. అలాగే గుండె జబ్బులు రాకుండా చూస్తాయి. నోని పండ్లను తినడం వల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుందని సైంటిస్టులు చేపట్టిన అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. ఈ పండ్లలో స్కోపోలెటిన్, క్వర్సెటిన్ అనే సమ్మేళనాలు ఉంటాయి. ఇవి యాంటీ ఇన్‌ఫ్లామేటరీ గుణాలను కలిగి ఉంటాయి. కనుక నోని పండ్లను తింటున్నా లేదా వాటి జ్యూస్‌ను తాగుతున్నా ఆర్థరైటిస్ నొప్పుల నుంచి ఉపశమనం లభిస్తుంది. అలాగే వాపులు కూడా తగ్గిపోతాయి.

### నొప్పులకు..

నోని పండ్లు సహజసిద్ధమైన పెయిన్ కిల్లర్‌గా పనిచేస్తాయి. అధ్యయనాలు చెబుతున్న ప్రకారం ఈ పండ్ల జ్యూస్‌ను తాగడం వల్ల కీళ్ల నొప్పులు, మెడ నొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది. ఈ పండ్లను తింటే కండరాలు ప్రశాంతంగా మారుతాయి. కండరాల నొప్పులు తగ్గుతాయి. శారీరక శ్రమ లేదా వ్యాయామం చేసేవారు ఈ పండ్లను తింటున్నా లేదా వీటి జ్యూస్‌ను తాగుతున్నా కండరాల నొప్పి నుంచి బయట పడవచ్చు. నోని పండ్లు బీపీని తగ్గిస్తాయి. చెడు కొలెస్ట్రాల్ (ఎల్‌డీఎల్)ను తగ్గించి మంచి కొలెస్ట్రాల్ (హెచ్‌డీఎల్)ను పెంచుతాయి. దీంతో గుండె ఆరోగ్యంగా ఉంటుంది. హార్ట్ ఎటాక్ రాకుండా అడ్డుకోవచ్చు. పొగ తాగేవారు ఈ పండ్లను తింటుంటే గుండె పోటు రాకుండా చూసుకోవచ్చని పరిశోధకులు చెబుతున్నారు.

### బరువు తగ్గేందుకు..

నోని పండ్లను తీసుకోవడం వల్ల షుగర్ లెవల్స్ తగ్గుతాయి. ఇన్సులిన్ సెన్సిటివిటీ పెరుగుతుంది. దీంతో శరీరం ఇన్సులిన్‌ను మరింత సమర్థవంతంగా ఉపయోగించుకుంటుంది.

దీని వల్ల టైప్ 2 డయాబెటిస్ అదుపులో ఉంటుంది. అధికంగా బరువు ఉన్నవారు రోజూ నోని జ్యూస్‌ను తాగుతుంటే ఫలితం ఉంటుందని పరిశోధకులు చెబుతున్నారు. ఈ జ్యూస్ వల్ల శరీర మెటబాలిజం పెరుగుతుంది. క్యాలరీలు ఖర్చవుతాయి. కొవ్వు కరుగుతుంది. అధిక బరువు తగ్గుతారు. ఆకలి నియంత్రణలో ఉంటుంది. ఆహారం తక్కువ తినేలా చేస్తుంది. నోని జ్యూస్‌ను రోజూ తాగడం వల్ల లివర్ ఆరోగ్యంగా ఉంటుంది. లివర్‌లోని వ్యర్థాలు బయటకు పోతాయి. ఫ్యాటీ లివర్ ఉన్నవారికి నోని జ్యూస్ ఎంతగానో మేలు చేస్తుంది. ఇలా నోని జ్యూస్‌ను తాగడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు. దీన్ని మెడికల్ షాపుల్లోనూ మనం కొనుగోలు చేయవచ్చు. ఆన్‌లైన్‌లోనూ లభిస్తుంది.

# స్వాగతిస్తూనే పాక్ ను నమ్మ వద్దంటున్న నేతలు

న్యూఢిల్లీ, మే 10: కాల్పుల విరమణ ఒప్పందం కుదిరినా సరే పాకిస్థాన్ ను మాత్రం నమ్మొద్దని పలువురు భారత రాజకీయనేతలు అభిప్రాయపడ్డారు. పాక్ ను ఓ కంట కనిపెడుతుండాలని సూచించారు.

సిద్ధరామయ్య (కర్ణాటక ముఖ్యమంత్రి) కాల్పుల విరమణను స్వాగతిస్తూనే, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. "భారత్, పాకిస్థాన్ రెండూ అంగీకరిస్తే మంచిదే. అయితే, మనం అప్రమత్తంగా ఉండాలి? కాల్పుల విరమణ ఉన్నప్పటికీ, ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంపై దృష్టి సారించాలి" అని అన్నార

భగవంత్ మాన్ (పంజాబ్ ముఖ్యమంత్రి): కాల్పుల విరమణను స్వాగతిస్తూ, నిఘా అవసరాన్ని నొక్కిచెప్పారు. "కాల్పుల విరమణ ప్రకటించడం శుభవార్త, కానీ పంజాబ్ అప్రమత్తంగా ఉంటుంది. మా అంతర్జాతీయ సరిహద్దులో యాంటీ–డ్రోన్ వ్యవస్థలను ఏర్పాటు చేస్తాం" అని చండీగఢ్‌లో విలేకరుల సమావేశంలో ప్రకటించారు.

శశి థరూర్ (కాంగ్రెస్ ఎంపీ): కాల్పుల విరమణ అత్యవసరమైనదని, ఆలస్యంగా జరిగిందని అభివర్ణించారు. "శాంతి అత్యవసరం నాకు చాలా సంతోషంగా ఉంది. భారత్ ఎప్పుడూ దీర్ఘకాలిక యుద్ధాన్ని కోరుకోలేదు. ఉగ్రవాదులకు గుణపాఠం చెప్పడానికే భారత్ యుద్ధం చేసింది, ఆ గుణపాఠం చెప్పబడింది" అని అన్నారు.

కపిల్ సిబల్ (రాజ్యసభ ఎంపీ): కాల్పుల విరమణను స్వాగతిస్తూ, ఇది పాకిస్థాన్‌లోని ఉగ్రవాద మౌలిక సదుపాయాల నిర్మూలనకు దారితీయాలని నొక్కిచెప్పారు. "కాల్పుల విరమణను నేను స్వాగతిస్తున్నాను, ఇరుపక్షాలను అభినందిస్తున్నాను. ఇప్పుడు యుద్ధంతో సంబంధం లేని అమాయకుల ప్రాణనష్టం చూడము? వారు (పాకిస్థాన్) దీనిని ఆపి, ఈ ఉగ్రవాద శిబిరాలను తొలగించి, అవి ఈ దేశంలో ఉగ్రవాదానికి కేంద్రాలుగా మారకుండా చూడాలి. అది కొనసాగినంత కాలం, ఈ సంఘర్షణ కొనసాగుతుంది, తాత్కాలిక కాల్పుల విరమణ ఎప్పటికీ శాశ్వతం కాదు" అని ఆయన అభిప్రాయపడ్డారు.

# టెస్టు సారథిగా గిల్.. డిప్యూటీగా పంత్.. ఎందుకంటే..?

న్యూఢిల్లీ, మే 10:సుదీర్ఘ ఫార్మాట్‌కు రోహిత్ శర్మ వీడ్కోలు పలకడంతో కొత్త కెప్టెన్ ఎంపిక అనివార్యమైంది. ఇంగ్లండ్ సిరీస్‌కు ముందే నయా సారథిని నియమించేందుకు బీసీసీఐ సిద్ధమవుతోంది. అయితే.. విరాట్ కోహ్లీ కెప్టెన్సీ ఆశిస్తున్నా.. సెలెక్టర్లు మాత్రం కుర్రాళ్లకే బాధ్యతలు అప్పగించాలని భావిస్తున్నారట. ఈ నేపథ్యంలో భావి కెప్టెన్‌గా కితాబులు అందుకుంటున్న శుభ్‌మన్ గిల్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా పేర్లను పరిశీలించే అవకాశం ఉంది.

కానీ, బుమ్రా ఫిట్‌నెస్ దృష్ట్యా అతడు సుదీర్ఘ కాలం జట్టుకు నాయకుడిగా ఉండే అవకాశం తక్కువ. కాబట్టి యంగ్‌స్టర్ అయిన గిల్ మంచి ఎంపిక అని మాజీ క్రికెటర్లు అంటున్నారు. ఒకవేళ అతడికే పగ్గాలు అప్పగిస్తే.. డిప్యూటీగా రిషభ్ పంత్(ను ఎంపిక చేస్తారనే వార్తలు వినిపిస్తున్నాయి.

టెస్టులకు రోహిత్ రిటైర్మెంట్ ప్రకటించగానే అందరి దృష్టి బుమ్రాపైనే నిలిచింది. అనుభవజ్ఞుడైన ఈ యార్కర్ కింగ్‌కు నాయకత్వ లక్షణాలు ఉన్నాయని అందరూ అన్నారు. కానీ, ఫాస్ట్ బౌలర్ అయిన అతడు తరచూ గాయాలపాలయ్యే అవకాశముంది. ఇప్పటికే ఈ స్పీడ్‌స్టర్ వెన్నునొప్పితో కొన్ని రోజులు ఆటకు దూరమయ్యాడు. భవిష్యత్‌లోనూ బుమ్రా కొన్ని మ్యాచ్‌లు ఆడలేకపోతే ఆ ప్రభావం జట్టుపై పడుతుంది. సో.. అలాంటప్పుడు శుభ్‌మన్ గిల్‌ను కెప్టెన్ చేయడం మంచిదని పలువురు సూచిస్తున్నారు. బుమ్రాను సారథిగా చేయనప్పుడు వైస్ కెప్టెన్సీ ఇవ్వడం అర్థ రహితమని కొందరి వాదన. దాంతో.. విదేశాల్లో విధ్వంసక ఇన్నింగ్స్‌లతో అలరించిన పంత్.. ఉప సారథిగా ఉంటే బాగుంటుందని బీసీసీఐ వర్గాలు అనుకుంటున్నాయి.

జట్టులో యువరక్తం

ప్రస్తుత పరిస్థితుల్లో వరల్డ్ క్లాస్ బ్యాటర్‌గా ఎదిగిన గిల్‌కు కెప్టెన్సీ ఇవ్వడమే ఉత్తమం. బుమ్రా, కోహ్లీ, కేఎల్ రాహులల బదులు అతడికి పగ్గాలు అప్పగించడం ద్వారా జట్టులో యువరక్తం నిండుతుంది. గిల్ సారథ్యంలో టీమిండియా బలమైన శక్తిగా మారే అవకాశం ఉంటుంది. ఎందుకంటే.. కోహ్లీని మళ్లీ కెప్టెన్ చేస్తే.. అతడు మహా అంటే రెండు మూడు ఏళ్లు టెస్టు క్రికెట్ ఆడొచ్చు. 33 ఏళ్లున్న రాహుల్ సుదీర్ఘ ఫార్మాట్‌లో కెప్టెన్‌గా ఎక్కువ రోజులు కొనసాగడం కష్టమే. సీనియర్లు వైదొలిగాక.. మళ్లీ కొత్త సారథి వేట తప్పనిసరి. అదేదో ఇప్పుడే గిల్‌ను నాయకుడిని చేస్తే అతడు ఆలోపు రాటుదేలుతాడు. ఇప్పటికే ఐపీఎల్ 18వ సీజన్‌లో అతడు గుజరాత్ టైటాన్స్‌ను ప్లే ఆఫ్స్‌కు చేరువచేశాడు. కెప్టెన్‌గా రాణిస్తూనే.. బ్యాటర్‌గా పరుగుల వరద పారిస్తున్నాడు. సో.. ఇప్పుడు బీసీసీఐ పెద్దలతో పాటు అభిమానులు కూడా గిల్‌ను టెస్టు సారథిగా చూడాలని కోరుకుంటున్నారు. ఇప్పటివరకూ 32 టెస్టుల్లో 35.05 సగటుతో 1,893 పరుగులు సాధించాడీ యంగ్‌స్టర్. అందులో 5 సెంచరీలు, 7 అర్ధ శతకాలు ఉన్నాయి.

